క్లుప్తంగా

పోచమ్మబస్తీలో గడపగడపకూ కాంగ్రెస్



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ పోచమ్మ బస్తీ, రామాలయం ఏరియాలో ఆదివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పాలని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు నూకల రమేష్, పల్లె రాజు, పుల్లూరి లక్ష్మణ్, నోముల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

డెంటల్ వైద్యుల అసోసియేషన్ ఎన్నిక

మంచిర్యాలటౌన్: జిల్లా డెంటల్ వైద్యుల నూతన అసోసియేషన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఫయాజ్‌ఖాన్, కార్యదర్శిగా డాక్టర్ నిశాంత్ పాలకుర్తి, కోశాధికారిగా డాక్టర్ సునీల్ భాస్కర్ కైలాస, పలువురిని కార్యవర్గ సభ్యులిగా ఎన్నుకున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించి తలిదండ్రుల కోరికలను నెరవేర్చాలన్నారు. క్రమశిక్షణ, నిర్దిష్టమైన ప్రణాళికతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి కోరారు. మార్కుల కోసం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న ఈ ప్రతిభ పరీక్ష ఎంతో దోహదడుతుందన్నారు. హాజీపూర్ మండల కార్యదర్శి చెవ్వుటు మల్లేశ్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

గోదావరికి తరలిన ముదిరాజ్‌లు



భీమారం: మండల కేంద్రంలోని మహాలక్ష్మి దేవాలయం నుంచి లక్ష్మీదేవరతోపాటు ముదిరాజ్‌లు ఆదివారం చెన్నూరు గోదావరి నదికి పుణ్యస్నానాల కోసం తరలివెళ్లారు. సోమవారం ఆలయంలో లక్ష్మీదేవర బోనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల

శ్రీనివాస : సార్

వెంకటేశ్వర : ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు

జెమిని సినిమా స్క్రీన్ 1 : బలగం/ఇన్‌కార్

జెమిని సినిమా స్క్రీన్ 2 : ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు/సార్

లక్సెట్టిపేట

మహానంద : ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు

జన్నారం

రాఘవేంద్ర : ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు

చెన్నూర్

శ్రీశ్రీనివాస : కోనసీమ థగ్స్

బెల్లంపల్లి

రామకృష్ణ : ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు

బాలాజీ : సార్

సీసీసీ

దేవి : వినరో భాగ్యము విష్ణుకథ

తిరుమల : సార్

- మంచిర్యాలటౌన్

అంతర పంటలతో ఆదాయం..!

- ఆయిల్ పాం తోటల్లో సాగుకు మొగ్గు
- జిల్లాలోని 400ఎకరాల్లో కర్బూజ, 100ఎకరాల్లో మిరప
- ఆశాజనకంగా పంటలు



శివలింగాపూర్‌లో అంతర పంటగా వేసిన కర్బూజను పరిశీలిస్తున్న ఏఈవో, రైతు

చెన్నూర్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పాం పంట సాగు చేసేందుకు రైతులను ప్రోత్సాహిస్తుండటంతో అధిక సంఖ్యలో ముందుకు వచ్చి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 384మంది రైతులు 1317ఎకరాల్లో ఆయిల్ పాం పంటను సాగు చేస్తుండగా, మరో వెయ్యి ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. చెన్నూర్, కోటపల్లి, మందమర్రి మండలాల్లో రైతులు ఎక్కువగా ఆయిల్ పాం పంటను సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చే సరికి నాలుగేళ్ల సమయం పడుతుండగా, సీజనల్ పంటలుగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కొందరు రైతులు ఆయిల్ పాంలో అంతర పంటగా పత్తి పంటను సాగు చేయగా, మరి కొందరు రైతులు పత్తి, కర్బూజ పంటలు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వంద ఎకరాల్లో మిరప, 400ఎకరాల్లో కర్బూజ పంటలు అంతర పంటగా సాగు చేస్తున్నారు. కొందరు రైతులు కూరగాయల సాగు కూడా చేస్తున్నారు. సంవత్సరం పొడవునా అంతర పంటలు సాగు చేసుకొని రైతులు ఆదాయం పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పాంతో పాటు అంతర పంటల సాగు ద్వారా రైతులకు లాభాలు చేకూరుతున్నాయి.

12ఎకరాల్లో అంతర పంటగా కర్బూజ..



ఆయిల్ పాం సాగవుతున్న 12 ఎకరాలను కౌలుకు తీసుకొని అంతర పంటగా కర్బూజ సాగు చేస్తున్నాను. కర్బూజ సాగుకు ఎకరానికి రూ.50వేల పెట్టుబడి పెట్టాను. మల్చింగ్ ఏర్పాటు చేసి సాగు చేస్తున్నాను. దిగుబడి బాగానే ఉంది. కిలో కర్బూజ రూ.15కి అమ్ముతున్నాను.

– హనుమంతరావు, రైతు

అంతర పంటల సాగుతో ఆదాయం



ఆయిల్ పాంలో అంతర పంటల సాగులో నిరంతర ఆధాయం వస్తుంది. ఆయిల్ పాం కాత ప్రారంభం అయ్యే సరికి ఈ పంటల ద్వారా ఆదాయం పొందవచ్చు.

– రాజశేఖర్, ఏఈవో

నాలుగేళ్ల సమయం పడుతుంది..



ఆయిల్ పాం పంట కాతకు వచ్చే సరికి నాలుగేళ్ల సమయం పడుతుంది. ఆయిల్ పాం పంటలు రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. అలాగే ఆయిల్ పాం తోటల్లో అంతర పంటలను కూడా సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు ఎల్లప్పుడు ఆదాయం ఉంటుంది.

– తిరుపతి, హెచ్‌వో

అక్రమ పట్టాపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: మండలంలోని తపాలపూర్ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు అక్రమ పట్టా పొందిన విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తపాలపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు తమ కుమారుల పేరుతో అక్రమంగా పట్టా చేయించడం సిగ్గు చేటన్నారు. సర్వే నంబర్ 147/11, సర్వే నంబర్ 147/6 లపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు స్పందించకుంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, ఉపాధ్యక్షుడు మహేశ్, నాయకులు రమేశ్, అజార్, రాజన్న, ఇందయ్య, గంగన్న యాదవ్, బొంతల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

లక్సెట్టిపేట: జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా, రెండు మండలాల్లో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కోరగా, ప్రధాని దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట బీజేపీ నాయకులు బొప్ప సతీశ్, వేముల మధు, చంద్రయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



రెడ్డి మహిళా వెల్ఫేర్ ఆధ్వర్యంలో...

మంచిర్యాలటౌన్: రెడ్డి మహిళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు సూచించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.సాగరిక, డాక్టర్ జయభారతి, ఆర్ఐ ఆది లక్ష్మీ హాజరుకాగా వారిని ఘనంగా సన్మానించి, మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటకం



అంబేద్కర్ నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్ ఆవరణలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయం, లక్ష్యాలపై కళాకారులు నాటక ప్రదర్శన చేశారు. ముందుగా వంచిత్ బహుజన్ అగాడి పార్టీ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, దళితసేనా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, అంబేద్కర్ సంఘ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు ఆయన నాటక ప్రదర్శన చేశారు. బీసీ బహుజనులకు రాజ్యాధికారం, 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు, అంబేద్కర్ కొందరివాడు కాదు, అందరివాడు అనే విషయాలపై ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు అశోక్, వివిధ సంఘాల నాయకులు గంగాధర్, రాజన్న, విజయ్, తుంగూరు గోపాల్, పద్మ, తులసిపతి, మల్లేశ్, బుచ్చన్న, లింగన్న, రాజన్న, జాడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఎదుర్కొంటాం’

పాతమంచిర్యాల: భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఎదుర్కొంటామని డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిశెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం డీవైఎఫ్ఐ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ విప్లవ కెరటాలుగా నిలిచారని, బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేఖంగా పోరాటాలు చేసి యువతకు దిక్సూచిగా నిలిచారన్నారు. దేశంలో రోజురోజుకూ మతోన్మాదం పెరుగుతుందని, మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి మహేశ్, కమిటీ సభ్యులు ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అ‘పూర్వ’ సమ్మేళనం

జైపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-1998 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒక చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగరిత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ హాజరై ఆనాటి జ్ఞాపకాలను తోటి స్నేహితులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు అందరూ ఒక చోట కలుసుకుని మమ్మల్ని ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రకాశ్‌రావు, శంకర్‌రావు, దత్తకుమార్, సురేశ్, శ్రీదేవి, దివాకర్‌రెడ్డిలను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి బహుమతులతో సత్కరించారు.

సంక్షిప్త వార్తలు

‘అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం’

పాతమంచిర్యాల: ప్రజాసంఘాల నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని కాగజ్‌నగర్‌లో అరెస్టు చేసిన ప్రజాసంఘాల నాయకులను బేషరతుగా విడుదల చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు తోకల తిరుపతి, లాల్‌కుమార్, దొండ ప్రభాకర్ ఉన్నారు.

కొత్తపల్లిలో క్రికెట్ పోటీలు

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం సర్పంచ్ గోధారి తిరుపతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. యువకులు ముందుకు వచ్చి క్రీడాపోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు తనవంతు సాయంగా క్రికెట్ కిట్లు అందించనున్నట్లు తెలిపారు.

కుమ్మర సంఘం మండల కమిటీల ఎన్నిక

పాతమంచిర్యాల: కుమ్మర సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరి తిరుపతి మాట్లాడుతూ మండలాలవారీగా మండల కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు, మండల ఇన్‌చార్జులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘు, కుమ్మర సంఘం నాయకులు పాల్గొన్నారు.

పైపులను సరిచేయండి..!



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గని లోపలి నుంచి బయటకు సరఫరా చేసే నీరు పైపు కట్ కావడంతో నీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు కోతకు గురైన పైపులను వెంటనే సరిచేసి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

- ఎమ్మెల్యే దివాకర్‌రావు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంచిర్యాలటౌన్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి పనులను చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 28వ వార్డులో ఆదివారం రూ.70లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, వార్డు కౌన్సిలర్ సాయి భార్గవి, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ పల్లపు తిరుపతి, ఇతర వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘బీజేపీపై బురద చల్లడం సరికాదు’



మాట్లాడుతున్న రమేశ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వే రడగంబాల బస్తీలోని కొందరి భూముల ఆక్రమణ విషయంలో బీజేపీ నాయకులపై బురద చల్లడం సరికాదని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్ తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే రడగంబాల బస్తీకి చెందిన ముప్వ జ్యోతి, ఆశీర్వాదం, ప్రకాష్, సాజన్, బీనా భూ ఆక్రమణ దారులకు బీజేపీ నాయకులు అండదండలు అందిస్తున్నారని తప్పుడు విమర్శలు చేశారని తెలిపారు. ముఖ్యంగా మాజీ ఎంపీ వివేక్ పేరు ప్రస్తావించి అతడి అనుచరులు భూ కబ్జాలు చేయడానికి యత్నాలు చేస్తున్నారని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆ విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అనవసరంగా తమపార్టీ నాయకులను విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ గౌడ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కోడి రమేష్, ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు సబ్బని రాజనర్సు, రాజలింగు, సురేష్, నాగరాజు, రాజేష్, యుగేందర్, శ్యామ్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా సీసీరోడ్డు



దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలకు వెళ్లే రోడ్డుకు సీసీ రోడ్డు నిర్మాణానికి గతేడాది రూ.15లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కాగా, పనులు ప్రారంభించి కొంతమేర సీసీ రోడ్డు వేశారు. రూ.2లక్షల వరకు నిధులు ఖర్చు చేసి, కొంత మేర సీసీ రోడ్డు వేసినా, గడువు ముగియడంతో పనులు అక్కడికే నిలిపివేశారు. మిగిలిన నిధులు వెనక్కిమళ్లాయి. రోడ్డు నిర్మాణానికి మళ్లీ నిధులు మంజూరు చేయకపోవడంతో, ఏడాది గడుస్తున్నా సీసీ రోడ్డు అసంపూర్తిగానే మిగిలిపోయింది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, అసంపూర్తి రోడ్డును పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈఈ తివారీని సంప్రదించగా గతేడాది సీసీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. గడువులోగా పనులు పూర్తికాకపోవడంతో చేసిన కాడికి బిల్లు చేసి, మిగితా పనులు నిలిపి వేశాం, మిగిలిన నిధులు కూడా వాపస్ చేయడం జరిగింది. ఆ రోడ్డు నిర్మాణానికి మళ్లీ నిధులు మంజూరు కాలేదన్నారు.

అలరించిన మదర్స్ ప్రైడ్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో గల మదర్ ప్రైడ్ ప్లే స్కూల్ 5వ వార్షికోత్సవం అలరించింది. సింగరేణి కమ్యూనిటీ హాల్లో కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరయ్యారు. పిల్లలకు చదువొక్కటే ముఖ్యం కాదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. పెద్దయ్యాక అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ప్లే విధానంలో విద్యబోధన చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. మార్కులొక్కటే విద్యార్థి ప్రతిభకు కొలమానం కాదన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, ఎంఈవో పోశయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, సాయిబాబా ఆలయ చైర్మన్ రాజేంద్రపాణి, కౌన్సిలర్లు సంధ్యారాణి, పద్మ, హైమద్, లక్ష్మీ, సత్యనారాయణ, కుమార్, నాయకులు సంతోషచారీ, ఖాసీం, పాఠశాల కరస్పాండెంట్ ఉపేందర్, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శోభ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టమైనా ఇష్టంగా చదువుకుని, ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. బెల్లంపల్లి, తిర్యాణి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్, విజయ్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

- దండేపల్లి

